

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 17-09-2025 | సంపుటి - 27 | సంచిక - 126 | రూ : 4 | పేజీలు: 8


## మహిళా సంఘాలకు
# బతుకమ్మ కానుక

- మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక
- చీరల పంపిణీకి సర్వం సిద్ధం
- ఒకే రకమైన డిజైన్, రంగుల్లో తయారీ...
- ఒక్కో చీర విలువ సుమారు రూ.800
- గ్రామాల వారీగా అందజేసేందుకు ఏర్పాట్లు




2లో

## నేటి అర్ధరాత్రి నుంచి
# ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత

2లో




2లో

## రైతుబంధు..
# వీరికి విందు...

- 2,936 ఎకరాల్లో 3,069 మందికి నకిలీ పట్టాలు
- ధరణి పోర్టల్లోకి అక్రమంగా ఎంట్రీలు.. రైతుబంధు నిధుల స్వాహా
- నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలో తాజా సర్వేలో వెలుగులోకి..



2లో

## సాంప్రదాయ యుద్ధాలు ముగిశాయి..

కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి

## మెడికల్ కౌన్సిలింగ్ లో
# అవకాశం కల్పించాలి

- మెడికల్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించాలి
- లోకల్, నాన్ లోకల్ సమస్యపై సడలింపు ఇవ్వాలి
- ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద విద్యార్థుల నిరసన



2లో

## హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వణికించిన క్లౌడ్ బరస్ట్



2లో

- హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు
- కొండచరియలు విరిగిపడి హిమాచల్‌లో ముగ్గురు దుర్మరణం



## బతుకమ్మ ఉత్సవాలకు..
# బతుకమ్మ కుంట సిద్ధం

- 25న బతుకమ్మకుంటలో బతుకమ్మ సంబురాలు..
- ఈ ఉత్సవాల్లో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి..
- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు, ఉన్నతాధికారులు..
- సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న బతుకమ్మకుంట..

2లో

## నేడు లండన్‌లో 150 మంది సీఈఓలతో
# మంత్రి రోడ్ షో



2లో

- విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్-2025కు గ్లోబల్ లీడర్లకు ఆహ్వానం
- ఏపీలో పెట్టుబడి అనుకూల విధానాలను వివరించనున్న మంత్రి

## ప్రజలకు మరింత చేరువలో
# పాస్‌పోర్టు సేవలు

- ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు
- రాయదుర్గంలో సరికొత్త పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



2లో

# నేడు లండన్‌లో 150 మంది సీఈఓలతో మంత్రి నారా లోకేశ్ రోడ్ షో

**అమరావతి, సెప్టెంబర్ 16 :** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నాడు లండన్‌లో పారిశ్రామికవేత్తలతో ఉన్నతస్థాయి రోడ్ షో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025"కు ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. లండన్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ సెంటర్‌లో భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు ఈ రోడ్ షో ప్రారంభమవుతుంది. ఈ కీలక సమావేశంలో యూకే డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం అధ్యక్షుడు హర్షల్ అస్నానీ, ఐసీఐసీఐ బ్యాంకు యూకే సీఈఓ రాఘవ్ సింఘాల్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అభిషిక్త్ కిశోర్ వంటి ప్రముఖులు పాల్గొంటారు. వీరితో పాటు గ్లోబల్ ఫండ్స్, తయారీ, సేవా రంగాలకు చెందిన సుమారు 150 మంది సీఈఓలు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేసిన తీరును (స్పీడ్ ఆఫ్ డూయింగ్), పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న విధానాలను వివరించనున్నారు. గత 15 నెలల్లో రాష్ట్రానికి రూ.10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులు వచ్చాయని, పరిశ్రమల కోసం లక్ష ఎకరాలతో ఇండస్ట్రియల్ క్లస్టర్లను సిద్ధం చేశామని ఆయన తెలియజేస్తారు. ఈ పెట్టుబడులను రాబోయే ఏడాదిలో రెట్టింపు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేయనున్నారు. రోడ్ షోలో భాగంగా మంత్రి లోకేశ్ ఏపీలోని పెట్టుబడి అవకాశాలపై ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. హిందూజా, రోల్స్ రాయిస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమవుతారు. పోర్టు ఆధారిత పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్, ఆధునిక తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను ఆయన ప్రధానంగా ప్రస్తావిస్తారు. ఎరిక్సన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సైయంట్, లండన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రేడ్, టెక్నాలజీ, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నారు.

## మెడికల్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** ప్రభుత్వం 2024 జులై నెలలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 ద్వారా 2024 వరకు చదువు పూర్తి చేసి, మంచి ర్యాంకులు సాధించిన పిల్లలు (విద్యార్థుల) స్థానికత పేరుతో తీవ్రంగా నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారిందని, నాన్ లోకల్ కింద పరిగనింపబడి నష్టపోతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిలింగ్ 2025 లో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు జాకీర్ అహ్మద్, నవీన్ కుమార్, లక్ష్మి, విగ్నేశ్వర రావు, అశోక్ లు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 ను పూర్తిగా సమర్థిస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలలో ఏదైనా జీవో జారీ అయినప్పటి నుండే నిబంధనలు అమలవుతాయని, కానీ కొంతమంది ఉన్నతాధికారుల బాధ్యత రాహిత్యం వల్ల వెసులుబాటు ఉన్నా సరే బంగారు భవిష్యత్తు కలిగిన విద్యార్థులను వైద్య విద్యకు నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 33 ను 2024 లో ప్రభుత్వం జారీ చేసిందని, జీవో జారీ చేయబడిన తేదీ కంటే ముందే పక్క రాష్ట్రాల్లో చదువు పూర్తి చేశారని, పిల్లలు కేవలం రెండు సంవత్సరాలు పక్క రాష్ట్రంలో విద్యను అభ్యసించినంత మాత్రాన నాన్ లోకల్ గా పరిగణించడం భావ్యం కాదని, అలా పరిగణించడం వల్ల 2025 నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన 50 మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని లోకల్ క్రింద పరిగణించాలని, మెడికల్ కౌన్సిలింగ్ లో పాల్గొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలందరూ స్థానికులు కానప్పుడు ఎలక్షన్లలో తమవి ,పిల్లల ఓట్లు ఎలా పరిగణిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వారి స్థానికత ఎక్కడో, వారి భవిష్యత్తు ప్రభుత్వమే నిర్ణయించాలన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గ్రామాల విద్యార్థులు తల్లిదండ్రులు దగ్గరగా ఉన్న మంచి కాలేజీలో పిల్లలని చేర్పించాలని కోరుకుంటారని, మేము అలాగే చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన జరిగినప్పుడు 10 సంవత్సరాల ఏ రాష్ట్రంలో చదివినా వారి స్థానికత కోటకు అర్హులేనని ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు. కాబట్టి తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని నీట్ కౌన్సిలింగ్ విషయంలో లోకల్, నాన్లోకల్ సమస్యపై సడలింపు ఇచ్చి నష్టపోతున్న విద్యార్థులను ఆదుకోని కౌన్సిలింగ్లో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వణికించిన 'క్లౌడ్ బరస్ట్'

**హిమాచల్ ప్రదేశ్, సెప్టెంబర్ 16 :** ఉత్తర భారతంలోని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను క్లౌడ్ బరస్ట్ వణికించింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు ఈ రెండు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ ప్రకృతి బీభత్సానికి హిమాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు మృతి చెందగా, రెండు రాష్ట్రాల్లోనూ భారీ ఆస్తి నష్టం సంభవించింది. వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించి, జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో ఈ వర్షాల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. జిల్లాలోని నిహ్రీ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఒక ఇంటిపై పడటంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, మరో ఇద్దరిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయని జిల్లా ఎస్పీ సాక్షి వర్మ తెలిపారు. ఇక ధర్మపూర్ పట్టణంలోని బస్ స్టాండ్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరద ప్రవాహానికి 20కి పైగా ప్రభుత్వ బస్సులు, ఇతర వాహనాలు కొట్టుకుపోయాయని, సమీపంలోని వర్క్‌షాప్‌లు, పంప్ హౌస్‌లు, దుకాణాలు కూడా ధ్వంసమయ్యాయని ఉప ముఖ్యమంత్రి ముఖేశ్ అగ్నిహోత్రి ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. అటు రాజధాని సిమ్లాలోనూ పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. ఇక, ఉత్తరాఖండ్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. ముఖ్యంగా రాజధాని డెహ్రాడూన్‌లోని సహస్రధార, రాయ్‌పూర్, మాల్దేవతా ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సహస్రధార నది ఉప్పొంగి ప్రవహించడంతో హోటళ్లు, దుకాణాల్లోకి వరద నీరు, బురద చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. మాల్దేవతా ప్రాంతంలో ఏకంగా 100 మీటర్ల పొడవైన రోడ్డు వరద ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.ప్రకృతి విపత్తుపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వేగంగా స్పందించాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మంగళవారం ఉదయం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, అధికారులతో సమీక్షించారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, రహదారులను పునరుద్ధరించే పనులు ముమ్మరం చేశామని ఆయన తెలిపారు. సహస్రధార నదిలో చిక్కుకుపోయిన ఐదుగురిని రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), పోలీసులు కలిసి రక్షించారని వెల్లడించారు. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోనూ సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

## సాంప్రదాయ యుద్ధాలు ముగిశాయి.. కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి: రాజ్‌నాథ్ సింగ్

**ఢిల్లీ, సెప్టెంబర్ 16:** సాంప్రదాయ యుద్ధ పద్ధతులకు కాలం చెల్లాయని, ఇకపై దేశం ఎదుర్కోబోయేది సమాచార, సైద్ధాంతిక, పర్యావరణ, జీవ సంబంధిత యుద్ధాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2025లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యుద్ధాలు ఎప్పుడు, ఎలా మొదలవుతాయో ఊహించడం చాలా కష్టమని రాజ్‌నాథ్ అన్నారు. "యుద్ధం రెండు నెలలు జరగొచ్చు, ఏడాది లేదా ఐదేళ్లయినా కొనసాగవచ్చు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మన సైనిక సామర్థ్యం సరిపడా ఉండేలా చూసుకోవాలి" అని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సంఘర్షణల నేపథ్యంలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న సైన్యం యొక్క ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత అయిన 'సుదర్శన చక్ర' వ్యూహాన్ని నిర్మించేందుకు కమాండర్లు చొరవ తీసుకోవాలని రాజ్‌నాథ్ కోరారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వాస్తవిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకు మధ్యకాలిక, పదేళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన 'జై' (జాయింట్‌నెస్, ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్) మంత్రం ప్రాముఖ్యతను ఆయన పునరుద్ఘాటించారు. ఆత్మనిర్భరత అనేది కేవలం నినాదం కాదని, అది మన దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అత్యంత కీలకమైన అవసరమని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం మన బలం, వ్యూహం, స్వావలంబనకు నిదర్శనమని కొనియాడారు. రక్షణ రంగంలో భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి కోసం ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థలతో మరింత లోతైన భాగస్వామ్యం అవసరమని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ 2025'కు తాను ఆమోదం తెలిపినట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసి, జాప్యాన్ని తగ్గించేందుకు 'డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ 2020'ను సవరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, డీఆర్‌డీఓ ఛైర్మన్ సమీర్ వి. కామత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలకు
# బతుకమ్మ కుంట సిద్ధం..

**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** బతికే ఉన్నాను అని నిరూపించుకున్న బతుకమ్మ కుంట.. పేరును సార్ధకత చేసుకుంటూ ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలకు సిద్ధమౌతోంది. ఈ నెల 25వ తేదీన బతుకమ్మ ఉత్సవాలకు బతుకమ్మ కుంట వేదిక కాబోతోంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాలకు హాజరౌతున్నారు. అదే రోజు పండగ వాతావరణంలో బతుకమ్మకుంటను నగర ప్రజలకు ముఖ్యమంత్రి అంకితం చేయనున్నారు. బతుకమ్మ కుంట వద్ద ఈ ఉత్సవ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొని అక్కడి ఏర్పాట్లను వివరించారు. జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంటకు గుర్తింపు వచ్చేలా ఇక్కడ బతుకమ్మ ఉత్సవాలు జరగాలని సమీక్ష సమావేశంలో వేంనరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. బతుకమ్మ కుంట చుట్టూ రాబోతున్న ఆకర్షణలను అడిగి తెలుసుకున్నారు.

**హైడ్రా కృషి అభినందనీయం :**

ఆక్రమణలకు గురై నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి పిచ్చి మొక్కలతో అటువైపు వెళ్లాలంటే కాదు.. కనీసం చూడాలంటే భయపడే విధంగా బతుకమ్మ కుంట మారిపోయింది. కబ్జాల చెర నుంచి విముక్తి చేసి.. సర్వాంగ సుందరంగా బతుకమ్మ కుంటగా తీర్చడంలో హైడ్రా కృషి అభినందనీయం అని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి చేయడానికి రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. కోర్టుకు వాస్తవాలు వివరించి బతుకమ్గకుంటకు జీవం పోసిన ఘనత హైడ్రాదే అని కొనియాడారు.

## నేటి అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్(టీఏఎన్‌హెచ్ఏ) ప్రకటించింది. ఈ మేరకు 'టీఏఎన్‌హెచ్ఏ' రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యశ్రీ కింద అనుసంధానమైన 323 ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి పెద్దమొత్తంలో బకాయిలు రావాల్సి ఉందని, ఈ విషయమై ఆరోగ్యశాఖ మంత్రి, ఆరోగ్యశ్రీ సీఈవోలను కలిశామని..అయినా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో సేవలు నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఇటీవల జరిపిన చర్చల్లో రూ.140 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సోమవారం రూ.100 కోట్ల బకాయిలు విడుదల చేశామని, మరో రూ.40 కోట్లు త్వరలో విడుదల చేయనున్నామని వైద్య వర్గాలు వెల్లడించాయి. అయితే ప్రభుత్వం నుంచి తమకు సుమారు రూ.1,400 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉందని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు చెబుతున్నాయి.

# మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక

**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** కామారెడ్డి : మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) సభ్యులకు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చీరలను రేవంతన్న కానుకగా అందించనున్నది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు సంవత్సరానికి రెండు చీరల చొప్పున పంపిణీ చేసేందుకు సిద్ధం చేసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని 18 సంవత్సరాలు నిండిన, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరికీ బతుకమ్మ చీరెలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం రేషన్ కార్డులో పేరున్న ప్రతీ మహిళకు రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. ఈ పథకం కింద అందించిన చీరలు నాణ్యతగా లేవని మహిళలు వీటిని ధరించడం లేదని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం గత బతుకమ్మ పండగకు చీరల పంపిణీని నిలిపి వేసింది. దీంతో కొంత వ్యతిరేకత వస్తుందని భావించి తిరిగి ఈ పథకాన్ని కొన సాగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరెలు అందించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ పంపిణీ ప్రక్రియను చేపట్టింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**మహిళలకు రేవంతన్న కానుక**

అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక పేరిట చేనేత చీరలను ఇందిరా మహిళ శక్తి పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే డ్రెస్ కోడ్ లో భాగంగా వారికి దసరా పండును పురస్కరించుకొని రెండేసి చీరెలను పంపిణీ చేయాలని నిర్ణ యించింది. నాణ్యత విషయంలో ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. చీరల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చీరెలను జిల్లాలోని మండలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో విడతల వారీగా చీరెలు రానున్నాయి. అయితే చీరెలను ఎక్కడ భద్రత పరిచేది స్టాక్ పాయింట్ల వివరాలను ప్రభుత్వం ముందే తెప్పించుకుంది. జిల్లాలోని 7 మండల సమాఖ్యలను చీరలను నిల్వ చేసేందుకు ఎంపిక చేశారు. ఇక్కడి నుంచి మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. మండలాల్లో చీరలను నిల్వ చేసే స్టాక్ పాయింట్లను ఇప్పటికే గుర్తించారు. ఇక్కడి నుంచి గ్రామాల వారీగా ఎస్ హెచ్ జీ సభ్యులకు అందించనున్నారు. గతంలో రేషన్ కార్డు ఆధారంగా అందించగా ప్రస్తుతం స్వశక్తి సభ్యుల వారీగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో మహిళా సంఘ సభ్యులు ఇలా...

ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఎన్ని సంఘాలు ఉన్నాయి.? ఎంత మంది సభ్యులు ఉన్నారు.? అనే లెక్కలు తీశారు. అంతే గాకుండా మెప్మా సిబ్బందికి పంపిణీ బాధ్యతలను అప్పగించారు. కామారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,79,417 మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 24,272 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం 2,03,689 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు. వీరందరికి చీరల పంపిణీ జరగనుంది. డ్రెస్ కోడ్ లో భాగంగా అన్నీ ఒకే రంగుతో ఒకే విధంగా ఉంటాయి. మహిళా సంఘాల సభ్యులకు సంవత్సరానికి రెండేసీ చీరలు ఇస్తారు. కానీ ఈ సారి మాత్రం ప్రస్తుతం ఒక చీర నే పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళా సంఘాలకు చీరలను ఇవ్వడం ఇదే మొదటి సారి. గత సంవత్సరం ఇవ్వలేదు. అంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేసేది. మెప్మా సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేస్తారు. మహిళలకు రెండు రకాల చీరలను అందిస్తుండగా... ఇందులో ఆరున్నర మీటర్ల చీరలు, 9 మీటర్ల చీరలు ఉంటాయి.

## ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని రాయదుర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ, తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కే జై శ్రీనివాస, సిపిఓ, రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అన్నిహంగులతో సకల సౌకర్యాలతో పాస్‌పోర్టు సేవా కేంద్రం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శేరిలింగంపల్లి ప్రజలకు పాస్‌పోర్టుకు సంబంధిత సేవలు మరింత చేరువలో, వేగవంతంగా అందుబాటులోకి వస్తాయని, ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాస్‌పోర్ట్ అనేది భారతీయుల అంతర్జాతీయ గుర్తింపు పత్రం అని, అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఏర్పడే ముందే యువత పాస్‌పోర్ట్ తీసుకోవాలని సూచించారు. కొత్త భవనంలో రోజుకు 1000 స్లాట్లు అందుబాటులో ఉండడం వల్ల సేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కేంద్రం శేరిలింగంపల్లి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించడంతో పాటు, అత్యవసర అవసరాల సమయంలో వేగవంతమైన సేవలు అందించేలా రూపుదిద్దుకుందన్నారు.

# రైతుబంధు.. వీరికి విందు

హైదరాబాద్: నల్గొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలో నకిలీ పాసుపుస్తకాల దందా వెలుగు చూసింది. ప్రభుత్వం నుంచో, వారసత్వంగానో, కొనుగోలు ద్వారానో భూములు పొందకున్నా 3,069 మంది యజమానులుగా మారిపోయారు. ఏకంగా 2,936 ఎకరాలకు యాజమాన్య హక్కులు పొందగా.. 2019లో వారికి పాసుపుస్తకాలూ జారీ కావడం రెవెన్యూ వర్గాలనే విస్మయానికి గురిచేస్తోంది. ఇటీవల ప్రభుత్వం ఈ మండలంలో నిర్వహించిన ప్రయోగాత్మక సర్వేలో నకిలీ పట్టాల దందా వెలుగు చూసింది. తిరుమలగిరి మండలం చింతపాలెం, నెల్లికల్, తిమ్మాయిపాలెం తదితర గ్రామాలకు సరిహద్దుగా వేల ఎకరాల అటవీ, ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో కొన్నిచోట్ల పలువురు సాగు చేసుకుంటున్నారు. సాగులో లేకున్నా కొందరు తమ పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నిక్షిప్తం అయ్యేలా చక్రం తిప్పారు. రెవెన్యూ మాతృ రికార్డు(1బి)ల్లో వారి పేర్లు లేకున్నా ఎల్ఆర్‌యూపీని ఆసరాగా చేసుకుని అక్రమంగా పాసుపుస్తకాలు పొందారు. నాటి ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరాకు రూ.10 వేలు, కేంద్రం పెట్టుబడి సాయం రూపేణా మొత్తంగా రూ.6 వేలు మంజూరు చేశాయి. అక్రమంగా పట్టాలు పొందిన వారు 2019 నుంచి ఈ సాయాన్ని కొల్లగొట్టారు. ఇలా రూ.కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి. అక్రమ పట్టాలను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా నిధులను నిలిపివేసింది. ఆయా పట్టాలను రద్దు చేస్తూ తాజాగా చర్యలు చేపట్టింది.

**అక్రమం వెనుక పలువురి ప్రమేయం!**

భూమి ఎలా సంక్రమించిందనే లింక్ డాక్యుమెంట్ లేనిదే యజమానిగా రెవెన్యూ శాఖ గుర్తించదు. లేదంటే.. ప్రభుత్వం ద్వారా ఎసైన్డ్ భూమిని పొందైనా ఉండాలి. కానీ, ఇవేమీ లేకుండా తిరుమలగిరి మండలంలో వేల మందికి అక్రమ పట్టాలు మంజూరు చేసేశారు. ధరణి పోర్టల్లోనూ వారి సమాచారం నమోదు చేశారు. ఈ క్రమంలో అక్రమంగా పట్టాలు పొందిన తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాడు పనిచేసిన మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది రికార్డులను పరిశీలించకుండానే యాజమాన్య హక్కులు ఎలా కల్పించారనేది చర్చనీయాంశంగా మారింది. పహాణీ, 1బి రికార్డుల పరిశీలన చేపట్టకుండా కొత్తగా యాజమాన్య హక్కులను కల్పించడం వెనుక పలువురి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.



# మాతృశ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పథకం

*** ఎంజీ యూనివర్సిటీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందజేత**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని బొమ్మకంటి పూజ (బీకాం కంప్యూటర్స్) డిగ్రీ స్థాయిలో బంగారు పథకం సాధించారు. నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈనెల 15వ తేదీన నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో మంగళవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బంగారు పథకం సాధించిన బొమ్మకంటి పూజను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, ఆ లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. మహేందర్ రెడ్డి అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టపగలే దుమ్ము క్లీనింగ్

*** రాత్రి వేళలోనే పనులు చేపట్టాలని డిమాండ్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై దుమ్ము ధూళిని తొలగించేందుకు రూట్స్ మల్టీక్లీన్ యంత్రం ద్వారా పనులు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా య యంత్రం ద్వారా పనులు చేస్తున్నప్పటికీ ప్రస్తుతం పగటిపూట పనులు కొనసాగించడంపట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాత్రి 10 గంటలు దాటిన తరువాత, వాహనాల రద్దీ లేని సమయంలో డివైడర్లు, ఫుట్ పాత్‌ల వెంబడి ఉండే దుమ్ము, ధూళిని శుభ్రం చేసేందుకు ఈ వాహనాన్ని ఉపయోగించేవారు. కాని ప్రస్తుతం పగటి పూట ట్రాఫిక్ రద్దీ సమయంలో ఈ పనులు చేపడుతుండటంతో వాహనాల రాకపోకలు ఆగిపోవడం, దుమ్ము గాలిలో ఎగసిపడటంతో వాహనదారులకు రోడ్డు కనపడకపోవడం వలన ప్రమాదాల ముప్పు పొంచి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పలు నగరాల్లో ఇలాంటి క్లీనింగ్ కార్యకలాపాలు రాత్రివేళల్లో లేదా ట్రాఫిక్ తక్కువగా ఉన్న సమయంలో నిర్వహిస్తారు. అయితే ఇక్కడ మాత్రం పగటి పూట రద్దీ సమయాల్లో చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ వెంటనే చర్యలు చేపట్టి దుమ్ము ధూళి క్లీనింగ్ పనులను ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో నిర్వహించాలి అని డిమాండ్ చేస్తున్నారు.

## జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కేతురి నర్సింహా బదిలీ

*** ఘనంగా వీడ్కోలు పలికిన సిబ్బంది, స్థానికులు.**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కేతురి నర్సింహా బదిలీ అయ్యారు. మంగళవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ అవరణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా అక్టోబర్ లో బాధ్యతలు చేపట్టారన్నారు. పదకొండు నెలల స్వల్పకాలం వ్యవదిలోనే జగద్గిరిగుట్ట స్టేషన్ పరిధిలో లా అండ్ అడర్ సక్రమంగా నిర్వహించడం, స్థానిక ప్రజలతో మమేకమై నేరల నియంత్రణలో ప్రత్యేక శ్రద్ధ చూపించడం, బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా, చేస్తూ ఫ్రెండ్లి పోలీస్ కు నిలువెత్తు నిదర్శనమన్నారు. , బదిలీ పై వెళ్తున్న ఇన్స్పెక్టర్ నర్సింహా ను చూసి సిబ్బంది , స్థానికులు కంఠతడి పెట్టడం కోసమేరుపు, ఒక ఫ్రెండ్లీ పోలీస్ అధికారి బదిలీ పై వెళ్తుంటే బాధగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## మొక్కలను నాటండి... వాటిని సంరక్షించండి

*** గ్రంథాలయ చైర్మన్ వీరబాబు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించుకోవడం కూడా అంతే ముఖ్యమని గ్రంథాలయ చైర్మన్ వీరబాబు అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మన్ కీ బాత్ కే ఎన్ మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షాపరురాలు నైనిక రజువా కలిసి గ్రంథాలయ చైర్మన్ వీరబాబును సన్మానించి, ఆయనకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ, మొక్కల రాజశేఖర్ చేస్తున్న ప్రకృతి సేవలను అభినందించారు. ఆయన మున్ముందు మరెన్నో అవార్డులు సాధించి, వనజీవి రామయ్య స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.అలాగే చిన్న వయసులోనే ప్రకృతి హరిత దీక్ష తీసుకొని ''పూల బొకేలు వద్దు - పచ్చని మొక్కలే ముద్దు'' అనే నినాదంతో మొక్కలు పంపిణీ చేస్తున్న చిన్నారి నైనిక రజువాను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. మొక్కలు నాటడమే కాకుండా అవి పెరుగుతున్నాయా లేదా అనేది పరిశీలించడం కూడా ముఖ్యమని అన్నారు. మొక్కలను సంరక్షించడం ద్వారానే భవిష్యత్తు తరాలకు అవి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అంతరించిపోతున్న అడవులకు ప్రత్యామ్నాయంగా ఇలా మొక్కలు పెంపకం చేపడితే రానున్న కాలంలో ఆ మొక్కలే మహావృక్షాలుగా మారి ప్రకృతి సమతుల్యతను కాపాడుతాయన్నారు



## గ్రీన్ హిల్స్ రోడ్డు మీద
# ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

*** ఎమ్మెల్యే కృష్ణారావుకు బహుళ అంతస్తుల సముదాయాల సంఘాలు వినతి**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : గ్రీన్ హిల్స్ రోడ్డు మీద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ బహుళ అంతస్తుల సముదాయలైన రెయిన్ బో విష్టాస్, రాక్ గార్డెన్, మెరినా స్కై, రేయిన్ బో విష్టా ఫేస్ 1 సంఘాలు సంయుక్తంగా మంగళవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ రోడ్డు మీద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయించ వలసినదిగా కోరారు. సుమారు 15 వేల మంది నివసిస్తున్న ఈ సముదాయాల నుండి , ఇందులో ఉపాదికోసం రోజు వచ్చే 3వేల పైచిలుకు మహిళలు నిత్యం వేల సంఖ్య లో రోడ్డు కు అటువైపు వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రానున్న కాలంలో కొత్తగా రాబోయే సముదాయల ద్వారా వేల సంఖ్యలో నివాసాలు రాభోతున్న తరుణంలో పాదచారుల కు ప్రదాన సమస్య కు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయించి రంగదాముని మార్గం నుండి మాధాపూర్ కు ఫ్లై ఓవర్ నిర్మాణానికి కూడా ప్రయత్నంచేసి శాశ్వత పరిష్కారం చూపమన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తక్షణం సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని తెలియజేశారు. బండి.మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మూడు సముదాయాల సంఘాల సభ్యులు టి.సత్యనారాయణరెడ్డి,ఓంకార్ రెడ్డి,రామారావు,రామ్ తిలక్, సుమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో జాతీయ బాలల సమైక్యతా శిబిరాన్ని నిర్వహించడాన్ని సంతోషిస్తున్నాం

హైదరాబాద, (ప్రజాస్ఫూర్తి) : జైపూర్‌లో జరిగిన జాతీయ బాలల సమైక్యతా శిబిరం విజయవంతంగా ముగిసింది. జవహర్ బాల్ మంచ్ జాతీయ ఛైర్మన్ జీవీ హరి జీ, తెలంగాణ ఛైర్మన్ మామిడి రిషికేష్ రెడ్డి, రాష్ట్ర సమన్వయ ఇన్‌ఛార్జ్ జెబిఎం తెలంగాణ జిట్టా సునీల్ కుమార్ యాదవ్‌లకు జైపూర్‌లో జెండాను అందజేసి, తదుపరి శిబిరం తెలంగాణలో నిర్వహించబడుతుందని ప్రకటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో జాతీయ బాలల సమైక్యతా శిబిరాన్ని నిర్వహించడానికి సంతోషిస్తున్నామన్నారు. ఈ శిబిరాన్ని ఘన విజయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జీవీ హరి జీ, జాతీయ కమిటీ జెబిఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ప్రజా పాలన, సమైక్య పాఠశాలలు, యంగ్ ఇండియా నైపుణ్య అభివృద్ధి విధానాన్ని ప్రదర్శించడానికి కూడా సహాయపడుతుందన్నారు. జవహర్ బాల్ మంచ్ అనేది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ యొక్క యువ విభాగం, ఇది ఐదు సంవత్సరాలకు చేరుకోనుందని, రాహుల్ గాంధీ యొక్క ఈ ఆలోచన, వారిని రూపొందించడంలో అపారమైన కృషిచేసిందన్నారు.



## శివమహాదేవ దేవాలయం నూతన ట్రస్టు కమిటీ ప్రమాణ స్వీకారం

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామం శివమహాదేవ దేవాలయం నూతన ట్రస్టు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని దేవాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ప్రమాణ స్వీకారానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ నిఖిల్, ఆందోల్ మైసమ్మ దేవాలయం జూనియర్ అసిస్టెంట్ సత్తిరెడ్డిలు హాజరయ్యారు. శ్రీ శ్రీ శ్రీ శివ మహాదేవ దేవాలయ చైర్మన్ గా బండమీది ఎల్లయ్య, ధర్మకర్తలు బోసి అన్నపూర్ణ, బాతరాజు యాదయ్య, మాందోరి నరేష్, చెరుకు సాయిబాబా, ఎక్స్ అఫీషియెస్ మెంబర్ దొంతరబోని నరసింహలతో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బి.ఎన్.రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి హాజరై, నూతన కమిటీని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు



సుర్వి నరసింహ గౌడ్, మోగదాల రమేష్ గౌడ్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండిమీద మల్లేష్, మాజీ సర్పంచ్ ఊదరి నరసింహ, ఎర్రగోని లింగస్వామి, కళ్లెం దయాకర్ రెడ్డి, తొర్పునురి శ్రీకాంత్ గౌడ్ , బండమీద వెంకటేష్, ఎర్రగోని లింగస్వామి, మాందోరి సురేష్, ఊదరి నరసింహ, ఊదరి బుచ్చయ్య, పర్నె ధర్మారెడ్డి, ఎర్రగోనీ నవీన్, వలందాస్ సతీష్, తీగల రాజు, బండారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులు రెండు రోజులు బంద్

*** బంద్ పోస్టర్ల ఆవిష్కరణ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఫ్లెక్సీ అసోసియేషన్ ఓనర్స్ ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లా, మండల కేంద్రాలలో ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులు రెండు రోజులు బంద్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఫ్లెక్సీ ఇండస్ట్రీపై ఫ్లెక్సీ మెటీరియల్, కలర్స్, ముడి సరుకులపై జీఎస్టీ విపరీతంగా పెంచిందని ఆరోపించారు. రవాణా ఖర్చులు, విద్యుత్ చార్జీలు కూడా విపరీతంగా పెరగడం, చేత ఫ్లెక్సీ ఇండస్ట్రీపై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగంపై ఆధారపడిన అనేక మందిపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఆదేశానుసారంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్, చౌటుప్పల మున్సిపల్ ఫ్లెక్స్ ప్రింటర్ ఓనర్స్ ఏకాభిప్రాయంతో ఈ నెల 17, 18తేదీలలో ఫ్లెక్సీ షాపులు బంద్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు సముద్రాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బత్తిని రఘు, గౌరవ సలహాదారులు గోశిక రాజేందర్, బత్తిని మహేష్ మరియు కార్యవర్గ సభ్యులు సుర్వి శంకర్, సూరేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు – ఎమ్మెల్యే కూనంనేని



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.నియోజకవర్గ ప్రజల కోసం అనునిత్యం తపిస్తూ, అసెంబ్లీలో ప్రజా సమస్యలను ఎత్తిచూపుతున్నానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రకాల గ్రాంట్లు ద్వారా నిధులు రాబట్టామని, మరింత మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయని, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా నిజమైన లబ్ధిదారులకే పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని తల్లిదండ్రులను పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 వార్డులు, పాల్వంచ మున్సిపాలిటీలోని 24 వార్డులకు చెందిన 617 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్‌కే సాబీర్ పాషా, సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఆర్డీఓ మధు, తహశీల్దార్ పుల్లయ్య, డిఎస్పి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వార్డుకు చెందిన, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ అన్న పబ్బు శివ గత వారం క్రితం మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బత్తుల విప్లవ కుమార్ గౌడ్ శివ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. శివ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్, మాజీ కౌన్సిలర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, తొర్పునూరి రవి గౌడ్, చెరుకు రాజు గౌడ్, ఊడుగు నరసింహ గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ – సేవా కార్యక్రమాల్లో ఆదర్శం

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : మానవ సేవే మాధవ సేవ అనే నినాదాన్ని కర్తవ్యంగా తీసుకుని సమాజంలో పేద ప్రజలకు అండగా నిలుస్తూ వస్తున్న అమ్మ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు పల్లెర్ల చంద్రశేఖర్, తేలుకుంట్ల రజనీకాంత్ మాట్లాడుతూ 2009లో సమాజంలో పదిమందికి మంచి చేయాలనే సంకల్పంతో కొంతమంది స్నేహితులతో కలిసి యెలుగూరి నగేష్ కుమార్, పాబోలు మణికిరణ్, నరేంద్రుల అభిలాష్, అనంతుల రాంబాబు, వనం కృష్ణమోహన్, కలవల ప్రవీణ్, సముద్రాల రత్నాకర్, గౌరిశెట్టి నగేష్, దివ్వెల రమేష్ తదితర యువకులు కలిసి ఈ ట్రస్ట్‌ను స్థాపించామన్నారు. అప్పటినుంచి విద్యార్థులకు పుస్తకాలు, ల్యాప్టాప్‌లు, కాలేజీ ఫీజులు, పేదవారికి వైద్య సహాయం అందిస్తూ ఈ సంస్థ కొనసాగుతుందన్నారు. ఇటీవల ఇల్లందులోని స్టేషన్ బస్తీ ప్రాంతానికి చెందిన తల్లాడ మాధురి గొంతు ఇన్ఫెక్షన్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆమె భర్త నాగేశ్వరరావు అతి తక్కువ ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నందున వైద్య ఖర్చులు భరించడం కష్టమైంది. ఈ పరిస్థితిని గమనించిన మంగళవారం అమ్మ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి మాధురి వైద్య చికిత్స కోసం ₹10,000 రూపాయలు ఆర్థిక సాయం అందించింది తెలిపారు. ఇప్పటికే అనేక



పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ ట్రస్ట్ స్థానిక ప్రజల అభిమానాన్ని, ఆశీర్వాదాలను పొందుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ట్రస్ట్ సభ్యులు సంకల్పించారని అన్నారు. అలాగే ఈ సందర్భంలో పేద కుటుంబానికి చెందిన మాధురికి మెరుగైన వైద్యం అందించేందుకు ఇతర దాతలు కూడా సహాయం చేయాలని ట్రస్ట్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మరి కొంతమంది దాతలు ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, సంఘం సభ్యులు అమర్ గుప్తా, యెలుగూరి సతీష్, సంకా సత్య నాగేంద్ర శ్యామ్, నూనె వీరభద్రం తదితరులు ఆర్థిక సాయం అందించారు.

## ఫోటో.. ఓ మధుర జ్ఞాపకం

* ఫోటో ఎక్స్పో పోస్టర్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ
* సీఐ మన్మధ కుమార్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఒకసారి క్లిక్ అయిన ఫోటో.. ఎప్పటికీ ఓ మధుర జ్ఞాపకముగా నిలిచిపోతుందని చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ అన్నారు. హైదరాబాద్ లో ఈ నెల 19,20,21తేదీలలో నిర్వహించ తలపెట్టిన ఫోటో ఎక్స్పో వాల్ పోస్టర్లను చౌటుప్పల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ నార్సింగ్ లోని ఓం కన్వెన్షన్ హాల్ లో మూడు రోజుల పాటు ఫోటో ఎక్స్పో జరగనుందన్నారు. ఫోటో ఎక్స్పోలో ఫొటోస్, వీడియో సంబంధించిన పరికరాలు, ఫెస్టివల్, వర్క్ షాప్స్, అవార్డ్స్ తదితర కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. అనంతరం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు తొర్పు నూరి సాయిలు గౌడ్ మాట్లాడుతూ ఫోటో ఎక్స్పోలో మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీ అందించే విధంగా హైదరాబాద్ ఫోటో ఎక్స్పోలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ ఫోటో ఎక్స్పో కార్యక్రమానికి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, ఫోటో అండ్ వీడియోగ్రఫీ జిల్లా ఉపాధ్యక్షుడు యజ్ఞమాచారి. జిల్లా సహాయ కార్యదర్శి కాటంరాజు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సుక్క స్వామి, సహాయ కార్యదర్శి రోషనగారి రాఘవేందర్ గౌడ్, చింతల గణేష్, మెట్టు రామచంద్రారెడ్డి, ఊడుగు రమేష్ గౌడ్, పగడాల శంకర్, ఎర్ర శివకుమార్, భారత మధు, జక్క చలమంద రెడ్డి రెడ్డి, జంగారెడ్డి, పల్లెర్ల సుజిక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోడు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఇల్లందు డిఎస్పి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను శీఘ్రంగా పరిష్కరించాలనీ ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రబాను అన్నారు. మంగళవారం బోడు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి, వివిధ విభాగాలలో జరుగుతున్న కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడే క్రమంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం అందించాలన్నారు. నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు, మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నేర నియంత్రణ, చట్ట సువ్యవస్థ పరిరక్షణలో ప్రతి ఒక్కరు కట్టుదిట్టంగా పనిచేయాలని సూచించారు. అలాగే స్టేషన్ ప్రాంగణం శుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణలో ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని డిఎస్పీ సూచించారు. ప్రజలకు న్యాయం అందించే దిశగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కృషి చేయాలని కోరారు.

## ఆ బాధిత కుటుంబాల గుండెకోత కనిపించడం లేదా? : కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కొనసాగుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో నాలాలో పడి కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలను మూడు రోజులు గడుస్తున్నా వెలికితీయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిన ఘటనలో ఆరుగురి మృతదేహాలను ఇప్పటికీ గుర్తించలేని అసమర్థత కాంగ్రెస్‌దేనన్నారు. కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత మానవత్వం లేని కాంగ్రెస్‌కు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. నాలాల్లో బలి చేసిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే భారత రాష్ట్ర సమితి చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.



## విద్యార్థులు కళలలో కూడా రాణించాలి

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థులు చదువుతోపాటు కళలలో కూడా రాణించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కొత్తగూడెం జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో రెండు రోజులపాటు జరుగుతున్న జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచి కళల పట్ల ఆసక్తి ఉండేదని, కానీ నేటి విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్తు ఆకర్షణీయంగా ఉంటుందని కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మంచి అనుభవాలను పొందాలని కోరారు. ఈ పోటీల్లో 200 మంది విద్యార్థులు 12 రకాల కళారూపాలలో పాల్గొంటున్నారని అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్ తెలిపారు.

### మొదటి రోజు విజేతలు

థియేటర్ ఆర్ట్స్: ప్రథమ - నవభారత్ పబ్లిక్ స్కూల్ పాల్వంచ; ద్వితీయ - పీఎం శ్రీ జడ్పీ బాలికొన్నత పాఠశాల పాల్వంచ. విజువల్ ఆర్ట్స్ (2డి): ప్రథమ - వి.



అంశీత (నవభారత్ పబ్లిక్ స్కూల్, పాల్వంచ); ద్వితీయ - ఎన్. నిశిత సాయి (బీపీఎల్ స్కూల్, బూర్గంపహాడ్). శాస్త్రీయ నృత్యం: ప్రథమ - ఎం. ధవళ (త్రివేణి స్కూల్, లక్ష్మీదేవిపల్లి); ద్వితీయ - పి. ఖ్యాతి క్రిపిత (కృష్ణవేణి జూనియర్ కాలేజీ, కొత్తగూడెం). విజేతలకు బహుమతులు జిల్లా విద్యాశాఖాధికారి బి. నాగలక్ష్మి అందజేశారు.




## పి.డి.ఎస్.యూ జిల్లా 3వ మహాసభలో విద్యార్థి భారీ ప్రదర్శన

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) జిల్లా 3వ మహాసభ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి ఊర్దూఘర్ ఫంక్షన్ హాల్ వరకు ప్రదర్శన కొనసాగి, అనంతరం బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వాలు విద్యను వ్యాపార సరుకుగా మార్చుతున్నాయని విమర్శించారు. విద్యార్థి అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పి.డి.ఎస్.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సాంబ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొమరం సత్యనారాయణ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు వీరమల్ల ఉమ, మల్లూరి సుగుణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డి. అరుణ్, పల్లవి, సందీప్, సంతోష్, రాజేష్, జీవన్, మౌనిక, భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జీవో 64 రద్దు – టైమ్ స్కేల్ ఇవ్వాలంటూ కార్మికుల డిమాండ్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న డైలీ వేజ్, ఔట్సోర్సింగ్ కార్మికుల నిరవధిక సమ్మె ఐదవ రోజుకు చేరింది. జీవో 64, జీవో 527లను రద్దు చేయాలని, డైలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని లేదా టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకురావాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేసిన కార్మికులు, వేతన బకాయిలు చెల్లించాలని, జీవో 60 ప్రకారం 15,600 రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు. ధర్నాలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దొడ్డ రవికుమార్, కె. సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహ త్య చేసుకున్న సంఘటన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన భూక్య శంకర్ నాయక్ (55) మంగళవారం తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. గతంలో తన ఇల్లు కట్టినప్పుడు 5లక్షలు అప్పులు అయ్యిందని, అప్పటి నుంచి బాధ పడుతుండే వాడని, దీంతో మానసిక పరిస్థితి కూడా సరిగ్గా ఉండేది కాదని, ఈ క్రమంలో సోమవారం రాత్రి పొలం వద్దకు మోటార్ వేసేందుకు వెళ్లి అక్కడే చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుని కొడుకు భూక్య గంగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ గా శివకుమార్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సోమవారం 108, 102 వాహనాల పనితీరు, మైంటెనెన్స్‌పై సమీక్షా సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, నూతన జిల్లా సమన్వయకర్త సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో వాహనాల తనిఖీ నిర్వహించి, అందులో ఉన్న పరికరాల పనితీరును పరిశీలించారు. అంబులెన్స్ సిబ్బంది అంకితభావంతో పని చేసి, క్షతగాత్రులకు సమయానికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. రోగుల ప్రాణరక్షణే ముఖ్య ధ్యేయంగా పనిచేయాలని, వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

## పేద విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడద్దని సైకిళ్ల పంపిణీ

* బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పేద విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడద్దని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మోదీ గిఫ్ట్‌గా సైకిళ్ల పంపిణీ చేస్తున్నారని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ తెలిపారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని మోదీ గిఫ్ట్ పేరిట కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అందించిన సైకిళ్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నామాపూర్‌కు 38, పోతుగల్‌కు 35, చీకోడ్‌కు 16 మొత్తం 89 సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ముస్తాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లరపు సంతోష్ రెడ్డి, పోతుగల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ తలారి రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధా కిషన్, ఉపాధ్యాయులు మామిండ్ల భూపతి, గర్ల్స్ స్కూల్ హెడ్ మాస్టర్ రేష్మ, పంచాయతీ కార్యదర్శి ఆఫర్, కోల కృష్ణా, చీకోటి మహేష్, జంగ రాజు, నామపూర్‌లో జరిగిన కార్యక్రమంలో



ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు రాజయ్య, సద్ది భాస్కర్, ఉప సర్పంచ్ మండల ఉపాధ్యక్షులు గుండవేణి తిరుపతి, బూత్ అధ్యక్షులు శివ, హరీష్, చీకోడులో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, చర్లపల్లి సుధాకర్ రెడ్డి, మల్లారెడ్డి, బాద నరేష్, రమేష్, వెంకట్ స్వామి, మెతుకు మల్లయ్య తదితరులున్నారు.

# బొగ్గు టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

*** టిప్పర్ ల అతివేగమే కారణమని ఆరోపణలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:బొగ్గు టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కొత్తగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగూడెం హనుమాన్ బస్తీ నివాసి కలతురి వేణుగోపాల్ (49) ద్విచక్రవాహనంపై రుద్రంపూర్ నుండి కొత్తగూడెం వైపు వస్తుండగా.. త్రీ ఇంక్లైన్ వద్దకు చేరుకోగా అదే దిశగా వెళ్తున్న ఖాళీ బొగ్గు టిప్పర్ 3వ ఇంక్లైన్ వద్ద వెనుకనుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణుగోపాల్ తీవ్రంగా గాయపడగా,




108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం అందుకున్న కొత్తగూడెం టూ టౌన్ సీఐ డి.ప్రతాప్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బొగ్గు టిప్పర్లతో ఎన్నో ప్రమాదాలు**

కొత్తగూడెం పరిసరాల్లో బొగ్గు టిప్పర్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవర్లు ఓవర్ టైమ్ కోసం మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రాణాలు బలవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ బొగ్గు టిప్పర్ల వేగ నియంత్రణపై అధికారుల చర్యలు లేకపోవడం స్థానిక వాహనదారులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

# తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి నియామకం

హైదరాబాద్: తెలంగాణలో నలుగురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారుగా ఆయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఎన్వీఎస్ రెడ్డిని హెచ్ఎంఆర్ఎండీ బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన ప్రభుత్వం.. మెట్రో రైలు ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌గా శృతి ఓజా, ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య, హెచ్ఎండీఏ కార్యదర్శిగా కోట శ్రీవాత్సవకు అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా



ఎం.రాజారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రాజేశ్వర్ నియమితులయ్యారు.

# ఖరీఫ్‌లో ఇంకా 2 లక్షల టన్నుల యూరియా కావాలి

ఢిల్లీ: ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్‌ను కోరామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రమంత్రులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఎరువుల విషయంలో రైతులకు వచ్చిన ఇబ్బందులను కూడా ప్రస్తావించాం. అధికంగా దిగుమతులపై ఆధారపడినందున ఇబ్బందులు వస్తున్నాయి. రైతులను కాపాడే విషయంలో కొన్ని చర్చలు జరిగాయి. 1968లో చేసిన విత్తన చట్టానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నూతన చట్టాన్ని ఆమోదించాలని కోరాం. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. దేశంలో




ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు దిగుమతి సుంకాలు పెంచాలని కోరాం. కొత్తగూడెం విమానాశ్రయం గురించి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో చర్చించాం. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ పూర్తయిందని తెలిపాం. కేంద్ర ఉక్కుశాఖమంత్రి కుమారస్వామిని కలిసి బయ్యారం స్టీల్ విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరాం" అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# కేంద్ర మంత్రి ఫొటోతో సైబర్ మోసం..!



హైదరాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటో పెట్టి ఓ వృద్ధుడిని మోసం చేశారు సైబర్ నేరగాళ్లు. హైదరాబాద్‌కు చెందిన 68 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.14.35 లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. 'పెట్టుబడి పెట్టండి అధిక లాభాలు' వస్తాయంటూ ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టుకు సంతోష్‌నగర్‌కు చెందిన బాధితుడు ఆకర్షితుడయ్యారు. కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ఫొటో ఉండటంతో నమ్మి.. లింక్ క్లిక్ చేశాడు. తొలుత మెటల్ ట్రేడింగ్లో రూ.12,600 పెట్టుబడి పెట్టిన బాధితుడు.. లాభాలు చూపించడంతో విడతలవారీగా రూ.14.35 లక్షలు పెట్టుబడి పెట్టాడు. లాభాలు ఇవ్వకపోగా.. మరో రూ.8 లక్షలు కడితే మొత్తం డబ్బు రిలీజ్ చేస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

# రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం పెంపుపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వండి: డిప్యూటీ సీఎం భట్టి

వాణిజ్య పన్నుల శాఖలో ఆదాయం పెంచేందుకు సర్కిల్ వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆ శాఖ ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణ సమావేశం సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుదిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. వివిధ రకాల వస్తువుల వారీగా సమీక్ష చేయాలని ఆదేశించారు. కమర్షియల్ టాక్స్ విభాగానికి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి ఆదాయం పెంపునకు మార్గాలు అన్వేషించాలి డిప్యూటీ సీఎం సూచించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలో ఆదాయం పెంపునకు గత సంవత్సరం వేసిన కమిటీ, ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టు పరిస్థితిపై డిప్యూటీ సీఎం సమీక్షించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖతో ముడిపడి ఉన్న



హెచ్ఎండిఏ, జీహెచ్ఎంసి, హౌసింగ్ బోర్డు వంటి ఇతర శాఖలను సమన్వయం చేసుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆదాయం పెంచేందుకు అన్ని శాఖలను సమన్వయం చేసుకునే అంశాన్ని చీఫ్ సెక్రటరీ సీరియస్ గా తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం పెంపుదలకు సంబంధించి లోతుగా అధ్యయనం చేసి 15 రోజుల్లో నివేదిక తెప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును డిప్యూటీ సీఎం ఆదేశించారు. రవాణా శాఖలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోకపోవడానికి కారణాలు వాటిని అధిగమించేందుకు అలాంటి చర్యలు తీసుకోవాలి, అవసరమైతే ప్రత్యేక పాలసీ రూపొందిస్తామని మంత్రులు తెలిపారు. ఆదాయ వనరుల సమీక్ష సమావేశానికి వచ్చే ముందు అన్ని శాఖల ఉన్నతాధికారులు ఆయా శాఖలో ఆదాయం పెంపుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఒక స్పష్టమైన నివేదికతో సమావేశానికి హాజరుకావాలని డిప్యూటీ సీఎం సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమర్షియల్ టాక్స్ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, స్టాప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత మాజీ ఎంపీ మధుయాష్కికి అస్వస్థత

హైదరాబాద్: కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు పేషీలో ఉండగా. ఛాతి నొప్పి అంటూ ఒక్కసారిగా కూలబడిపోయారు. వెంటనే సచివాలయంలోని డిస్పెన్సరీలో వైద్యం అందించిన సిబ్బంది.. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు.






# యూఎస్ కన్సులేట్ కార్యాలయాన్ని సందర్శించిన జూనియర్ ఎన్టీఆర్

*** యూఎస్ కన్సులేట్ కార్యాలయాన్ని సందర్శించిన జూనియర్ ఎన్టీఆర్**

శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని అమెరికా కన్సులేట్ కార్యాలయాన్ని హీరో జూనియర్ ఎన్టీఆర్ మంగళవారం సందర్శించారు. అమెరికాలో చిత్రీకరణ చేసిన సినిమాలు, రాబోయే ప్రాజెక్టులకు సంబంధించిన విషయాలు అమెరికా కన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ తో చర్చించారు. ఎన్టీఆర్ యూఎస్ కన్సులేట్ కు రావడం పట్ల జనరల్ లారా విలియమ్స్ ఆనందం వ్యక్తం చేశారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలను మరింత బలపరిచే విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ తో అమెరికా కన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ దిగిన ఫొటోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# బతుకమ్మ షెడ్యూల్ ఇదే..
## కనివినీ ఎరుగని రీతిలో సంబరాలు : మంత్రి జూపల్లి సమీక్ష

సంప్రదాయం ఆధునికతల మేళవింపుగా, సంస్కృతి, ప్రకృతి, పర్యాటకంతో మమేకమయ్యేలా, సకల జనుల సమ్మేళనంతో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో బతుకమ్మ పండుగ నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు. గ్రామాలతో పాటు హైదరాబాద్‌లోనూ అత్యంత వైభవంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ముస్తాబు చేయాలని, అక్కడ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. బతుకమ్మపై ప్రత్యేక గీతాలు, మన సంస్కృతి, సాంప్రదాయలు ఉట్టిపడేలా, ప్రకృతి, పర్యాటకం, పర్యావరణం థీమ్ రూపకల్పన చేయాలని, వీటిని ప్రతీ ఒక్కరూ కాలర్ ట్యూన్స్, సోషల్ మీడియా స్టేటస్ లుగా పెట్టుకోవాలని కోరారు. ఉత్సవాల నిర్వహణ



అనంతరం పూలు, ఇతర సామాగ్రిని వృదాగా పారబోయకుండా వాటితో పర్యావరణహిత వస్తువులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు.

*** ఈ నెల 21 నుంచి 30 వరకు వేడుకలు:**

ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న వేడుకలను మరోసారి లోకానికి చాటి చెప్పేందుకు సన్నాహాలు చేయాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కోరారు. ఈ నెల 21న వరంగల్‌లోని చారిత్రాత్మక వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ ప్రారంభోత్సవాన్ని దిగ్విజయంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కొన్ని ఎంపిక చేసిన జంక్షన్లతో పాటు టూరిజం హోటళ్లు, రైల్వే, బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, విశ్వవిద్యాలయాల్లోనూ సాంప్రదాయ బతుకమ్మ ప్రతిమలు నెలకొల్పాలని అన్నారు. విద్యార్థులంతా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనేలా కళాశాల, యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్లు పండుగ దిగ్విజయంగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. సాంస్కృతిక కళాసారధులు సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ గ్యాలరీ డెరెక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు ప్రయాణంపై దుష్ప్రచారం.. మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు

తమ ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు అండగా ఉంటుందని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమతో పంచుకోవచ్చని మంత్రి సీతక్క మహిళా ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ గౌరవాన్ని కాపాడే విధంగా మహిళా ఉద్యోగులు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులుగా ఎన్నికైన మహిళల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం సచివాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు ప్రభుత్వ ఉద్యోగంలో రాణించడం ఒక పెద్ద సవాల్ అని అన్నారు. కుటుంబ బాధ్యతలు, వృత్తి బాధ్యతలు రెండింటినీ ఏకకాలంలో సమర్థంగా నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను ఆమె అభినందించారు. కుటుంబ భారం మోస్తూ, తమ ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారని, భర్త సహకారం ఉన్న మహిళా ఉద్యోగులు అదృష్టవంతులని ఆమె పేర్కొన్నారు.

*** సమానత్వం, మహిళా సాధికారత పై దృష్టి**

మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని మంత్రి సీతక్క సూచించారు. "హౌ టు రెస్పెక్ట్ ఉమెన్" అనే అంశాన్ని పిల్లలకు బోధించడం ద్వారానే సమానత్వం సాకారమవుతుందని అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించేందుకు ఈ నెల 22న ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశానికి మహిళా ఉద్యోగులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

# 'గాలుల విధ్వంసం'తోనే.. ఉత్తరాదిన బీభత్సం

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో తాజాగా కురిసిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. అయితే, ఈ అనూహ్య వర్షాలకు గాలుల విధ్వంసమే కారణమని వాతావరణశాఖ అధికారులు అంచనా వేశారు. పొడి పశ్చిమ గాలులు, తేమతో కూడిన తూర్పు గాలుల పరస్పర చర్య వల్లే భారీ వర్షాలు కురిశాయన్నారు. వీటి ప్రభావం మరో 24గంటలు ఉండవచ్చని అంచనా వేశారు. దెహ్రాదూన్‌లో రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలువురు గల్లంతు కావడంతోపాటు దాదాపు 500 మంది చిక్కుకుపోయారు. హిమాచల్‌లోని మండీలో కొండచరియలు విరిగిపడి, వరదల్లో ఓ బస్సు కూడా కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది గల్లంతయ్యారు. పశ్చిమ తేమ గాలులు, తూర్పు తడి గాలుల పరస్పర చర్య వల్లే భారీ వర్షాలు కురిశాయని దెహ్రాదూన్‌లోని ప్రాంతీయ వాతావరణశాఖ అధిపతి సీఎస్ తోమర్ వెల్లడించారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఎటువంటి వాతావరణ వ్యవస్థ లేదని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్ పలావత్ పేర్కొన్నారు. వెచ్చనిపొడి గాలుల భీకర చర్య వల్లే ఈ వర్షాలు వచ్చాయన్నారు. రాజస్థాన్ సమీపంలో తుపాను వ్యతిరేక, తేమతో కూడిన తూర్పు గాలుల



కారణంగా ఇది సంభవించిందని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఉత్తరాఖండ్ 1343 మి.మీ (సాధారణం కంటే 22శాతం ఎక్కువ), హిమాచల్‌లో 1010 మి.మీ (46శాతం ఎక్కువ) వర్షపాతం రికార్డు అయినట్లు అధికారులు వెల్లడించారు. హిమాచల్‌లో ఈ సీజన్‌లో 46 క్లౌడ్ బరస్ట్‌లు, 97 ఆకస్మిక వరదలు, 140 కొండచరియలు విరిగిపడిన ఘటనలు సంభవించాయని తెలిపారు.







## ఉమ్లింగ్ లా రహదారిపై ప్రయాణం... 'గిన్నిస్'లో చోటు

సూరత్: గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన గిరిజన యువకుడు మృగేశ్ రాథోడ్ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోకి ఎక్కాడు. బజాజ్ డొమినార్ 250 బైక్‌పై 25 రోజుల్లో 6,300 కిలోమీటర్లు ప్రయాణించి.. ప్రపంచంలోనే ఎత్తయిన మోటారబుల్ రోడ్‌గా పేరు పొందిన ఉమ్లింగ్ లా పాస్‌కు చేరుకోవడం ద్వారా ఈ రికార్డు సాధించాడు. లద్దాఖ్‌లోని ఈ ప్రదేశం సముద్ర మట్టానికి 19,024 అడుగుల ఎత్తులో ఉంది. నలుగురు స్నేహితులతో కలిసి ఆగస్టు 16న మృగేశ్ తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. మార్గంమధ్యలో మంచు, కొండచరియలు విరిగిపడటం, తక్కువ ఆక్సిజన్ లభ్యత వంటి కఠిన సవాళ్లు ఎదురైనా.. పట్టుదల, ధైర్యంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. గమ్యస్థానానికి చేరుకున్న అనంతరం విజయానికి ప్రతీకగా మృగేశ్ తన తెగకు చెందిన జెండాను ఆవిష్కరించాడు. ఈ రికార్డు అతడి తెగకు, సూరత్ ప్రాంతానికి గౌరవం తెచ్చిపెట్టింది.





## మహిళా అధికారి ఇంట్లో నోట్ల కట్టలు.. బంగారు ఆభరణాలు

అస్సాం కు చెందిన సివిల్ సర్వీస్ అధికారిణి నుపుర్ బోరాను పోలీసులు అరెస్టు చేశారు. భూ కుంభకోణానికి సంబంధించి ఆరోపణల నేపథ్యంలో ఆమె ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈక్రమంలో ఆమె ఇంట్లో నోట్ల కట్టలు, బంగారుఆభరణాలు లభ్యమయ్యాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక విజిలెన్స్ సెల్ అధికారుల బృందంలో నుపుర్ బోరా పని చేస్తున్నారు. గువాహటికి చెందిన ఆమెపై భూ కుంభకోణానికి సంబంధించి ఆరోపణలు ఉన్నాయని సీఎం హిమంత బిశ్వశర్మ ఆరోపించారు. బార్పేట్ జిల్లాలో సర్కిల్ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు డబ్బుకు బదులుగా భూమిని లంచంగా తీసుకున్నట్లు తేలిందన్నారు. దీంతో గత ఆరు నెలలుగా ఆమెపై నిఘా ఉంచినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే సోమవారం ఆమె ఇంటితో సహా మరో మూడు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సోదాల్లో రూ.90లక్షల నగదుతో పాటు రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆమెను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు వెల్లడించారు. కాగా.. సోదాల్లో దొరికిన డబ్బుతో పాటు నుపుర్ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. సీఎం విజిలెన్స్ ఎస్పీ రోజీ కలిత మాట్లాడుతూ.. ఈ కేసుపై పూర్తి దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నుపుర్‌పై చాలా అవినీతి ఆరోపణలు ఉన్నాయని, దర్యాప్తులో మరిన్ని బయటపడతాయని వెల్లడించారు. కాగా.. బార్పేట్‌లో ఆమెకు సహాయకుడిగా పనిచేసిన లాట్ మండల్ సురాజిత్ డేకా నివాసంలో కూడా అధికారులు సోదాలు చేశారు. ఇతడిపై కూడా భూ కుంభకోణం ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది.

## యుద్ధం మరింత ఉద్ధృతం.. గాజా సిటీలో భూతల దాడులు షురూ

గాజా నగరంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తతంగా మారాయి. కొన్నిరోజులుగా వైమానిక దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ బలగాలు నేరుగా ఆ ప్రాంతంలో అడుగుపెట్టాయి. భూతల దాడులు ప్రారంభించాయి. ప్రాణభయంతో వేలాది మంది పాలస్తీనీయులు నగరాన్ని వీడుతున్నారు. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని ఐరాస నివేదికలో వెల్లడైన రోజే ఈ దాడులు ప్రారంభం కావడం గమనార్హం. మరోవైపు.. గాజా నగరవ్యాప్తంగా తాజాగా జరిగిన దాడుల్లో 34 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజా సిటీ ఆపరేషన్‌లో ప్రధాన దశ ప్రారంభమైందని ఓ ఇజ్రాయెల్ సైనిక అధికారి వెల్లడించారు. శివారు ప్రాంతాల నుంచి నగరం నడిబొడ్డు దిశగా బలగాలు కదులుతున్నాయని తెలిపారు. ఈ నగరంలో దాదాపు రెండు వేల నుంచి మూడు వేలమంది హమాస్ ఉగ్రవాదులు ఉన్నట్లు అంచనా వేశారు. అదేవిధంగా అనేక రహస్య సొరంగాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఐడీఎఫ్ ఆపరేషన్‌కు ముందు గాజా సిటీలో దాదాపు 10 లక్షల మందికి పైగా పాలస్తీనా వాసులు నివాసం ఉండేవారు. ఇజ్రాయెల్ సైన్యం వివరాల ప్రకారం



ఇప్పటివరకు 3.5 లక్షల మంది నగరం విడిచి వెళ్లారు. ఐరాస అంచనాల ప్రకారం గత నెలలో 2.20 లక్షలమందికి పైగా పాలస్తీనియన్లు ఉత్తర గాజా నుంచి తరలివెళ్లారు. హమాస్ నెట్‌వర్క్ ధ్వంసమే లక్ష్యంగా పెట్టుకున్న ఇజ్రాయెల్ సేనలు.. గాజా సిటీలో భూతల దాడులు ఎన్నిరోజులు కొనసాగుతాయో స్పష్టత ఇవ్వలేదు. దీనికి నెలలు పట్టొచ్చని స్థానిక మీడియా అంచనా వేసింది. ఈ ఆపరేషన్‌ను నిలిపేయాలంటూ హమాస్ చెరలో ఇంకా బందీలుగా ఉన్నవారి కుటుంబాలు ప్రధాని నెతన్యాహు నివాసం ఎదుట నిరసనలు చేపట్టాయి. దాదాపు 20 మంది బందీలు సజీవంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ అంచనా వేస్తోంది. పాలస్తీనా ఖైదీల విడుదల, శాశ్వత కాల్పుల విరమణ, గాజా నుంచి బలగాల ఉపసంహరణకు అంగీకరిస్తేనే.. మిగిలిన బందీలను విడుదల చేస్తామని హమాస్ చెబుతోంది.

## కన్ఫ్యూజన్ ఏమీ లేదు.. త్వరలో సీఎం అభ్యర్థి ఎవరో తెలుస్తుంది

బిహార్‌లో ఎన్నికల వేడి రాజుకుంది. శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అధికార, విపక్ష కూటమి పార్టీల్లో సీట్ల పంపకాలపై తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి ఎవరన్న దానిపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ స్పందించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ విడుదలకానుంది. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారంలో మునిగిపోయాయి. తేజస్వీ యాదవ్ 'బిహార్ అధికార్ యాత్ర'ను ప్రారంభించారు. సందర్భంగా సీఎం అభ్యర్థి గురించి ప్రశ్న ఎదురైంది. దానిపై తమ విపక్ష కూటమిలో ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. "ప్రజలే యజమానులు. వారే ముఖ్యమంత్రిని ఎంపిక చేసుకుంటారు. వారు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారు. ఎవరు ముఖ్యమంత్రి కావాలో వారినే అడగండి. అప్పుడు సమాధానం మీకే తెలుస్తుంది" అని మీడియాతో మాట్లాడారు. కాగా.. ఇటీవల తేజస్వీ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.



సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన నెలకొన్న వేళ.. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బిహార్‌లో తాము తిరిగి అధికారం చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. అందుకోసం పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలతో కూటమిలో విభేదాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే.. బిహార్ 2020 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సీట్ల సర్దుబాటును పరిశీలిస్తే.. ఆర్జేడీ 144 స్థానాల్లో బరిలోకి దిగి 75 చోట్ల విజయం సాధించింది. మరోవైపు కాంగ్రెస్ 70 స్థానాలకు గానూ 19 చోట్ల గెలుపొందింది. సీపీఐఎంఎల్ 19 నియోజకవర్గాల్లో పోటీ చేసి 12 చోట్ల గెలుపు బావుటా ఎగురవేసింది. సీపీఎం, సీపీఐ వరుసగా 4, 6 స్థానాల్లో పోటీ చేసి చెరో రెండు చోట్ల విజయం సాధించాయి. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకొని, కూటమిలోని అన్ని పార్టీలకు సమన్యాయం జరిగేలా సీట్లను పంపిణీ చేసేందుకు కూటమి నేతలు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు.

## భక్తుల డబ్బు.. కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు: సుప్రీం కోర్టు

దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదని సుప్రీం కోర్టు (SC) వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన 'సుప్రీం' ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే.. అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా?" అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.



## మాజీ సీఎం కుమారుడి మద్యం కుంభకోణం.. రూ.1,000 కోట్లకుపైనే: ఈడీ

మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ దర్యాప్తులో చైతన్య బఘేల్ రూ.1,000కోట్ల విలువైన మద్యం సిండికేట్‌ను నడిపినట్లు గుర్తించామన్నారు. ఈ సిండికేట్‌ను నిర్వహించడానికి దాని సభ్యులకు అప్పటి ఐఏఎస్ అధికారి అనిల్, వ్యాపారవేత్త అన్వర్ ధేబర్ సహకరించినట్లు ఈడీ ఆరోపించింది. సిండికేట్ సేకరించిన అన్ని అక్రమ నిధుల ఖాతాలు, పంపిణీకి సంబంధించిన విషయాలను చైతన్య చూసుకునేవాడని ఈడీ ఆరోపించింది. ఇక్కడ వచ్చిన ఆదాయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు, పార్టీ కార్యకలాపాలకు వినియోగించేవాడని తెలిపింది. మరికొందరు రాజకీయ నేతలకు కూడా ఈ కుంభకోణంతో సంబంధం ఉందని..త్వరలో వారిపైనా చర్యలు





తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘేల్ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న సమయంలో 20192022లో రూ.2,500 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని.. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదు చేసిన ఈడీ ఇటీవల మాజీ సీఎం నివాసంలో సోదాలు చేపట్టింది. ఆ సమయంలో చైతన్య బఘేల్ అధికారులకు సహకరించకపోవడంతో ఈడీ ఆయనను అరెస్టుచేసింది.

## కళ్లముందే కూలిన గోడ.. రెప్పపాటులో మృత్యువును తప్పించుకుని..!

కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఝార్ఖండ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాంచీలో ఓ వీధిలో గోడ కూలిన భయానక ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వీడియోలో నీటితో నిండి ఉన్న వీధిలోని ఓ గోడను ఆనుకొని మహిళ నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పక్కన ఉన్న మరో భారీ గోడ ఒక్కసారిగి కూలిపోయింది. గోడ శిథిలాలు ఆమెకు అడుగు దూరంలో పడడంతో రెప్పపాటులో మృత్యువును తప్పించుకుంది. రాంచీతో సహా ఝార్ఖండ్‌లోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనుండడంతో భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

*** ఉత్తరాది రాష్ట్రాలను**



**ముంచెత్తుతున్న వరదలు**

ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకరస్థాయిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో మరోసారి మేఘ విస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలుచోట్ల ఇళ్లు కూలడంతో పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నారు. రుద్రప్రయాగ్‌లోని పలు ఆలయాలు నీట మునిగాయి. భారీ వర్షాల వల్ల వరదలు పోటెత్తడంతో జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో వేలమంది ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దిల్లీ, ముంబయి ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పలు ప్రాంతాల్లో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# మార్కెట్లకు డబుల్ కిక్...

**భారీ లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ!**
**భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**
**అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై అంచనాలు**
**తిరిగి ప్రారంభమైన భారత్-అమెరికా వాణిజ్య చర్చలు**
**దాదాపు 600 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్**
**కొనుగోళ్లతో కళకళలాడిన ఆటో, బ్యాంకింగ్ షేర్లు**
**అంతర్జాతీయ పరిణామాలతో బలపడిన రూపాయి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలు మన సూచీలకు కొత్త జోష్ ఇచ్చాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న బలమైన అంచనాలు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు మళ్లీ మొదలుకావడం వంటి అంశాలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఫలితంగా కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు రోజంతా లాభాల్లోనే కొనసాగాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 594.95 పాయింట్లు ఎగబాకి 82,380.69 వద్ద స్థిరపడింది. ఉదయం 81,852.11 వద్ద ట్రేడింగ్ ప్రారంభించిన సెన్సెక్స్, కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో 82,443.48 వద్ద గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 169.90 పాయింట్లు లాభపడి 25,239.10 వద్ద ముగిసింది. అమెరికా ఫెడ్ పాలసీ సమావేశంలో వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలు, భారత్-యూఎస్ వాణిజ్య చర్చలపై నెలకొన్న ఆశావహ దృక్పథం మార్కెట్లకు ఊతమిచ్చాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. "కొత్త జీఎస్టీ రేట్లు, పండగ సీజన్ డిమాండ్ అంచనాలతో ఆటో, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ మెరుగైన ప్రదర్శన కనబరిచాయి" అని ఆయన వివరించారు.

ట్రేడింగ్‌లో ఎఫ్ఎంసీజీ రంగం మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో సూచీ 1.44%, నిఫ్టీ ఐటీ 0.86%, నిఫ్టీ బ్యాంక్ 0.47% చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ షేర్లలో కోటక్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, మారుతీ సుజుకీ, టాటా స్టీల్ వంటివి ప్రధానంగా లాభపడగా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా లాభాలతోనే ముగిశాయి. ఇదే సానుకూల ధోరణి కరెన్సీ మార్కెట్‌లోనూ కనిపించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.13% బలపడి 88.05 వద్ద స్థిరపడింది.

## వినియోగదారులకు గుడ్ న్యూస్..

**జీఎస్టీ మార్పులకు అనుగుణంగా**
**పాల ఉత్పత్తుల రేట్లను తగ్గించిన మదర్ డెయిరీ**




**న్యూఢిల్లీ:** వస్తు సేవల పన్ను రేట్లలో కీలక మార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. జీఎస్టీలోని అత్యధిక పన్ను శ్లాబులను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. జీఎస్టీలో ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం పన్ను స్లాబులున్న విషయం తెలిసిందే. మార్కెట్‌లోని దాదాపు అన్ని వస్తూత్పత్తులపై ఈ స్లాబుల ప్రకారమే పరోక్ష పన్నులు పడుతున్నాయి. అయితే, వీటిలో 12, 28 స్లాబులను కేంద్రం తొలగించింది. ఇకపై 5, 18 శాతం స్లాబులు మాత్రమే ఉండనున్నాయి. ఈ కొత్త పన్ను రేట్లు ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం నిర్ణయంతో అనేక వస్తువుల రేట్లు తగ్గనున్నాయి. ఇందులో భాగంగానే ప్రముఖ డెయిరీ సంస్థ మదర్ డెయిరీ తాజాగా కీలక ప్రకటన చేసింది. పాల నుంచి నెయ్యి వరకూ అనేక ఉత్పత్తులపై జీఎస్టీ మార్పులకు అనుగుణంగా రేట్లను తగ్గించనున్నట్లు ప్రకటించింది.

వెన్న, నెయ్యి, మిల్క్ ప్రొడక్ట్స్, మజ్జిగ వంటివి 12 శాతం శ్లాబులో ఉండగా.. దీన్ని తొలగించడంతో ఇవి 5 శాతం శ్లాబులోకి చేరనున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగా మదర్ డెయిరీ ప్రకటన చేసింది. పాలు, పన్నీర్, బటర్, చీజ్, నెయ్యి, మిల్క్ షేక్స్ వంటి ఉత్పత్తుల రేట్లను తగ్గించి జీఎస్టీ బెనిఫిట్స్ ప్రజలకు అందించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ప్రొడక్ట్, ప్యాకేజింగ్‌ను బట్టి రూ.2 నుంచి గరిష్ఠంగా రూ.30 వరకు రేట్లు తగ్గనున్నాయని తెలిపింది. సంస్థ నిర్ణయంతో యూహెచ్‌టీ టోన్డ్ ఉత్పత్తుల ధర రూ.77 నుంచి రూ.75కి తగ్గనుంది. ఇదే సమయంలో 450 ఎంఎల్ డబుల్ టోన్డ్ యూహెచ్‌టీ పాల రేటు రూ.33 నుంచి రూ. 32కి, మిల్క్‌షేక్స్ (స్ట్రాబెర్రీ, చాకొలేట్, మ్యాంగో, రబ్రీ ఫ్లేవర్స్) 180 మిల్లీలీటర్ ప్యాక్ ధర రూ. 30 నుంచి రూ.28కి, 200 గ్రాముల పన్నీర్ రేటు రూ.95 నుంచి రూ.92కి, అదే 400 గ్రాముల ప్యాక్ రేటు రూ.6 వరకూ తగ్గనుంది. ఇక మలాయ్ పన్నీర్ 200 గ్రాముల ప్యాక్ రూ. 100 నుంచి రూ.97కు దిగొచ్చింది. ఇదే సమయంలో 500 గ్రాముల బటర్ ప్యాకెట్ రేటు రూ.305 నుంచి రూ.285కి తగ్గించింది. 100 గ్రాముల ప్యాక్ ధర రూ. 62 నుంచి రూ. 58 కి దిగొచ్చింది. చీజ్ క్యూబ్స్ 180 గ్రాములపై రూ. 10 తగ్గి రూ. 135కు చేరింది. చీజ్ స్లైసెస్ 480 గ్రాముల ధర రూ. 405 నుంచి రూ. 380కి తగ్గింది. చీజ్ బ్లాక్ (200 గ్రాములు) రూ. 150 నుంచి రూ. 140కి, చీజ్ స్ప్రెడ్ (180 గ్రాములు) రూ. 120 నుంచి రూ. 110కి తగ్గించింది. సవరించిన ధరలు ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి.

## ఫ్యూచర్ మార్కెట్‌లో మళ్లీ పెరిగిన బంగారం..!



**న్యూఢిల్లీ:** ఈ వారంలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రపంచ మార్కెట్‌లో బలమైన సంకేతాల నడుమ దేశీయ ఫ్యూచర్ మార్కెట్‌లో మంగళవారం బంగారం ధరలు మరోసారి స్వల్పంగా పెరిగాయి. రూ.119 పది గ్రాముల ధర రూ.1,10,298కి చేరుకున్నాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ధర 0.10 శాతం పెరిగింది. గత సెషన్‌లో పది గ్రాముల ధర రూ.1,10,330 రికార్డు స్థాయిని తాకిన విషయం తెలిసిందే. అలాగే, ఎంసీఎక్స్‌లో డిసెంబర్ కాంట్రాక్ట్ ధర రూ.109 పెరిగి పది గ్రాములకు రూ.1,11,346కి చేరుకుంది. సోమవారం రూ.1,11,350 వద్ద కొత్త గరిష్ట స్థాయికి చేరిన విషయం విధితమే. ఈ నెల 17న ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై పాలసీని ప్రకటించనున్నది. ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించనుందని వ్యాపారులు ఆశిస్తున్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో డిసెంబర్ డెలివరీకి సంబంధించిన ఫ్యూచర్స్ గోల్డ్ ఔన్సుకు ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 3,728.32 డాలర్లకు చేరుకున్నది. అమెరికా ద్రవ్య విధానంలో సడలింపులు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి మధ్య సురక్షితమైన ఆస్తులకు డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో ధరలు పెరుగుతున్నాయి. ఇటీవల వారాల్లో పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపించారని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు.

# నీరజ్, నదీమ్ మధ్య జావెలిన్ ఫైట్..




**టోక్యో:** ఆసియా కప్‌లో భారత క్రికెటర్లు పాకిస్థాన్ ఆటగాళ్లతో 'హ్యాండ్ షేక్' చేయకపోవడంపై పెద్ద చర్చే నడుస్తోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే దేశాన్ని తాము శత్రువుగానే చూస్తామని టీమిండియా ప్లేయర్లు పాక్ టీమ్‌తో కరచాలనం నిరాకరించారు. ఈ వివాదం ముగిసే లోపే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ జావెలిన్ త్రో ఫైట్ వచ్చేసింది. సెప్టెంబర్ 17 బుధవారమే క్వాలిఫయింగ్ రౌండ్ జరుగనుంది. దాంతో.. భారత స్టార్ నీరజ్ చోప్రా, పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ మధ్య ఎవరిది పైచేయి అవుతుంది? అని అందరూ ఆసక్తితో ఉన్నారు.

టోక్యో వేదికగా జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ క్వాలిఫయింగ్ రౌండ్ బుధవారం జరుగనుంది. అందరూ ఊహించినట్టుగా నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్‌ల మధ్య ఎలాంటి పోటీ ఉండడం లేదు. ఎందుకంటే ఇరువురు వేర్వేరు గ్రూప్‌లో ఉండడమే అందుకు కారణం.

అవును.. నీరజ్ గ్రూప్ ఏలో ఉండగా.. నదీమ్ గ్రూప్ బీ నుంచి బరిలోకి దిగుతున్నాడు. ఫైనల్‌కు క్వాలిఫయింగ్ దూరం 84.50 మీటర్లుగా నిర్ణయించారు. ఈ మార్క్ అందుకున్న 12 మంది బడిసె వీరులు ఫైనల్‌కు దూసుకెళ్తారు. ఒకవేల చోప్రాతో పాటు నీరజ్ కూడా అర్హత సాధిస్తే గురువారం నిర్వహించే ఫైనల్లో ఇద్దరూ తలపడే అవకాశముంది. అదేజరిగితే పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో చివరిసారిగా ఎదురుపడిన ఈ ఇద్దరూ మరోసారి ఢీ అంటే ఢీ అనడం ఖాయం.

**గ్రూప్ ఏ :** నీరజ్ చోప్రా, సచిన్ యాదవ్, జులియన్ వెబర్, జాకుబ్ వద్లెచ్, సుమేద రణసింగే, ఇతరులు.

**గ్రూప్ బీ :** అర్షద్ నదీమ్, రుమేశ్ పథిరగే, అండర్సన్ పీటర్స్, జులియస్ యెగో, రోహిత్ యాదవ్, యశ్వీర్ సింగ్.. తదితరులు.

ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న నీరజ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో టైటిల్ నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డనున్నాడు. ఈసారి కూడా అగ్రస్థానంలో నిలిస్తే భారత స్టార్ అరుదైన క్లబ్‌లో చేరుతాడు. ఇదివరకూ జాన్ జెలెంజీ (1993, 1995), అండర్సన్ పీటర్స్(2019, 2022)లు మాత్రమే రెండు పర్యాయాలు టైటిల్ సాధించారు. ఒలింపిక్స్‌లో వరుసగా పతకాలతో నీరజ్ చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే.

ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత జట్టు చేతిలో చిత్తుగా ఓడింది పాకిస్థాన్. 128 పరుగుల లక్ష్య ఛేదనను సిక్సర్‌తో పూర్తి చేసిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వెనక్కి తిరిగి చూడకుండా శివం దూబేతో కలిసి డగౌట్‌కు వచ్చేశాడు. ఆనవాయితీ ప్రకారం ప్రత్యర్థి ఆటగాళ్లకు ఇవ్వాల్సిన షేక్ హ్యాండ్ సంప్రదాయాన్ని పాటించలేదు సూర్య. దాంతో.. మ్యాచ్ రిఫరీని మార్చాలంటూ పాక్ బోర్డు గగ్గోలు పెట్టింది. అయినా సరే జై షా నేతృత్వంలోని అంతర్జాతీయ క్రికెట్ మండలి మాత్రం పట్టించుకోలేదు. ఎట్టిపరిస్థితుల్లోనూ రిఫరీని మార్చేది లేదని పీసీబీకి తెగేసి చెప్పింది.

## ఆనవాయితీకి మంగళం..

**ఈసారి జనవరిలోనే**
**డబ్ల్యూపీఎల్ సందడి..?**




**న్యూఢిల్లీ:** మహిళా క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ రాబోతోంది. వచ్చే ఏడాది ఆరంభంలో ఈ మెగా టోర్నీ జరుగనుంది. జనవరి మొదటి వారంలో డబ్ల్యూపీఎల్ సందడి మొదలవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. జనవరి 6 మంగళవారం లేదంటే 8వ తేదీ గురువారంజ.. ఈ రెండింటిలో ఒక తేదీన నాలుగో సీజన్ షురూ కానుందని సమాచారం. అయితే.. గత మూడు పర్యాయాలు ఫిబ్రవరి- మార్చి మధ్యలో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. మరి ఇప్పుడు ఉన్నట్టుండి ఆనవాయితీకి మంగళం పాడడానికి ఓ కారణముంది.

గత మూడు సీజన్లుగా మహిళల ప్రీమియర్ లీగ్ అభిమానులను అలరిస్తూ వస్తోంది. దాంతో, నాలుగో సీజన్ కోసం ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే.. వచ్చే ఏడాది వేసవిలో టీ20 ప్రపంచ కప్ పోటీలకు భారత్ ఆతిథ్యమిస్తోంది. సో.. ప్రపంచ కప్ మ్యాచ్‌లతో క్లాష్ లేకుండా చూడాలని డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచ కప్ మార్చిలో మొదలవ్వనుంది.

**కొత్త ఛాంపియన్‌ను చూస్తామా..!**

డబ్ల్యూపీఎల్ ఆరంభం సీజన్ నుంచి ఐదు జట్లు మాత్రమే పోటీపడుతున్నాయి. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్.. ఈ ఫ్రాంచైజీలే ఈసారి కూడా టైటిల్ కోసం పోటీపడనున్నాయి. మరో విషయం ఏంటంటే.. నాలుగో సీజన్ ఆరంభానికి ముందు నవంబర్‌లో వేలం పూర్తి చేసేందుకు సన్నాహకాలు చేస్తున్నారు నిర్వాహకులు.

గత సీజన్ విజేత ఆర్సీబీ డిఫెండింగ్ ఛాంపియన్‌గా టోర్నమెంట్ బరిలోకి దిగనుంది. తొలి రెండు సీజన్లలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. దాంతో.. నాలుగో సీజన్‌లో కొత్త విజేతగా కప్‌ను ముద్దాడేందుకు ఢిల్లీ, యూపీ, గుజరాత్ జట్లు పక్కా ప్రణాళికలు రచిస్తున్నాయి.

## రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించం..

**పీసీబీకి ఐసీసీ షాక్..!!**



**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌కు ఐసీసీ షాక్ ఇచ్చింది. ఆసియా కప్ నుంచి మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలన్న పీసీబీ డిమాండ్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మంగళవారం తిరస్కరించింది. భారత్-పాకిస్తాన్ మ్యాచ్ తర్వాత కరచాలనం వివాదం తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. టాస్ సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కరచాలనం చేయవద్దని పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘాను రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ చెప్పినట్లుగా పీసీబీ ఆరోపించింది. ఈ మేరకు పీసీబీ విజ్ఞప్తిని పరిశీలించిన ఐసీసీ.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని పాక్ బోర్డుకు వెల్లడించింది. పైక్రాఫ్ట్‌ను తొలగించేది లేదని పీసీబీకి ఐసీసీ వర్తమానం పంపంది. అప్పీల్‌ను తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది. బుధవారం యూఏఈతో జరిగే పాక్ చివరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లోనూ పైక్రాఫ్ట్ రిఫరీగా వ్యవహరించనున్నారు.

సమాచారం మేరకు.. మ్యాచ్ తర్వాత ఇద్దరు కెప్టెన్లు కరచాలనం చేయబోరని ఆసియా క్రికెట్ కౌన్సిల్‌లోని పలువురు అధికారులతో పాటు పీసీబీ డైరెక్టర్‌కు కూడా తెలుసని పలు నివేదికలు తెలిపాయి. అయినప్పటికీ పీసీబీ, పీసీబీ చైర్మన్ ఈ వ్యవహారాన్ని పెద్దది చేసినట్లుగా ఆరోపణలున్నాయి. పీసీబీ భారత ఆటగాళ్ళ, మ్యాచ్ రిఫరీపై ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసింది. పైక్రాఫ్ట్ సూచనల మేరకు ఇద్దరు కెప్టెన్ల మధ్య షేక్ మార్పిడి జరుగలేదని పాక్ జట్టు మేనేజ్ నవేద్ చీమా ఆరోపించారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ అని.. సూర్యకుమార్ యాదవ్‌తో కరచాలనం చేయవద్దని పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అఘాకు పైక్రాఫ్ట్ సూచించాడని చీమా పేర్కొన్నారు. ప్రత్యర్థి జట్టుతో కరచాలనం చేయడానికి నిరాకరించి భారత ప్లేయర్లు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పీసీబీ ఆరోపించింది.

అయితే పైక్రాఫ్ట్‌ను తొలగించకపోతే యూఏఈతో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పీసీబీ హెచ్చరించింది. ఈ క్రమంలో రేపు యూఏఈతో మ్యాచ్ జరుగనున్నది. అయితే, పీసీబీ బెదిరింపులకు ఐసీసీ లొంగలేదు. ఇందులో పైక్రాఫ్ట్ పాత్ర ఏం లేదని ఐసీసీ భావించింది. ఈ విషయంలో ఏసీసీ కూడా సమాచారం ముందే తెలిసినట్లుగా తేలడంతో ఐసీసీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఇక రేపు యూఏఈతో పాక్ మ్యాచ్ ఆడుతుందా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

# టీమిండియా టైటిల్ స్పాన్సర్‌గా అపోలో టైర్స్..

**బీసీసీఐతో ఒప్పందం..!**




**న్యూఢిల్లీ:** భారత జట్టుకు కొత్త టైటిల్ స్పాన్సర్ దొరికింది. టైటిల్ స్పాన్సర్ హక్కులను అపోలో టైర్స్ కంపెనీ దక్కించుకున్నది. ఈ మేరకు బీసీసీఐతో అపోలో టైర్స్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. ఒప్పందంలో భాగంగా అపోలో టైర్స్ బీసీసీఐకి ఒక్కో మ్యాచ్‌కు రూ.4.5కోట్లు చెల్లించనున్నట్లు బీసీసీఐకి చెందిన సీనియర్ అధికారి వెల్లడించారు. అయితే, దీనిపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ అపోలో టైర్స్‌తో ఒప్పందం కుదిరిందని.. త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. అపోలో టైర్స్ 2027 వరకు బీసీసీఐతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం.. అపోలో టైర్స్ బీసీసీఐకి ఒక్కో మ్యాచ్‌కు రూ. 4.5 కోట్లు చెల్లిస్తుందని పలు మీడియా నివేదికలు తెలిపాయి. గతంలో స్పాన్సర్‌గా వ్యవహరించిన డ్రీమ్ లెవెన్ ఒక్కో మ్యాచ్‌కు రూ.4కోట్లు చెల్లించిన విషయం తెలిసిందే. అపోలో టైర్స్ కాకుండా కాన్వా, జేకే టైర్స్ సైతం బిడ్స్ వేసినట్లు నివేదిక తెలిపింది. దాంతో పాటు బిర్లా ఆప్టస్ పెయింట్స్ ఆసక్తి చూపించినా బిడ్డింగ్‌లో ప్రక్రియలో పాల్గొనేందుకు మాత్రం ఇష్టపడలేదు.

స్పాన్సర్‌గా డ్రీమ్ 11 వైదొలిగిన తర్వాత బీసీసీఐ భారత జట్టు స్పాన్సర్ హక్కుల కోసం దరఖాస్తులను ఆహ్వానించిందిన విషయం తెలిసిందే. బిడ్డింగ్ ప్రక్రియ మంగళవారం జరిగింది. గేమింగ్, బెట్టింగ్, క్రిప్టో, పొగాకు బ్రాండ్లను బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతించబోమని బీసీసీఐ స్పష్టం చేసింది. రాబోయే రోజుల్లో భారత జట్టు జెర్సీపై అపోలో టైర్స్ పేరు కనిపించనున్నది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం యూఏఈ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో భారత జట్టు జెర్సీపై స్పాన్సర్ లేకుండానే ఆడుతున్న విషయం తెలిసిందే. అలాగే, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లోనూ భారత జట్టు జెర్సీ లేకుండానే ఆడుతున్నది. కొత్త స్పాన్సర్ దొరికిన నేపథ్యంలో రాబోయే మ్యాచ్‌లలో మహిళల జట్టు జెర్సీపై అపోలో టైర్స్ పేరు కనిపిస్తుందా? లేదా ? చూడాల్సిందే. రాబోయే ప్రపంచకప్ నుంచి జెర్సీ పేరు ఉంటుందా? అన్నది ఇంకా స్పష్టత లేదు. మహిళల వన్డే ప్రపంచకప్ సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభం కానున్నది. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నాయి.

# ప్రభాస్‌తో ప్రశాంత్‌వర్మ మూవీ

### జత కుదిరిందంటూ మూవీ టాక్





**టాకీస్:** జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్న రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో హర్రర్ కామెడీగా రూపొందుతోన్న రాజాసాబ్ త్వరలో విడుదలకు సిద్ధమవుతుతండ గా, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్, ప్రశాంత్ నీల్ సలార్ పార్ట్ 2, హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడికల్ వార్ డ్రామా ఫౌజీ, నాగ అశ్విన్ కల్కి పార్ట్2 సినిమాలు లైన్‌లో ఉన్నాయి. మరో ఆసక్తికరమైన అప్డేట్ వినిపిస్తోంది. హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు- సమాచారం. దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు. ఈ సినిమాకు ప్రస్తుతం 'బ్రహ్మ రాక్షస్'అనే వర్కింగ్ -టైటిల్ వినిపిస్తోంది. అయితే, -టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న 'హను-మాన్' సీక్వెల్ 'జై హను-మాన్' పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది రెండవ పెద్ద చిత్రం కావడం విశేషం. సినిమా హిస్టరీ బుక్స్ కాంతార' ఫేం రిషబ్ శెట్టి హనుమంతుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ప్రభాస్ అభిమానులు ఆయన ఈ కొత్త సినిమాతో మరోసారి భారీ విజయాన్ని అందిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ ప్రారంభం కాగానే మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశముంది.

## రజనీకాంత్ 'కూలీ' నుంచి 'పవర్‌హౌస్' ఓఎస్‌టీ విడుదల




**టాకీస్:** రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం కూలీ. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున విలన్ పాత్ర పోషించారు. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా నుంచి పాటలతో పాటు వీడియోలను ఒక్కొక్కటిగా యూట్యూబ్ వేదికగా వదులుతున్నారు మేకర్స్. తాజాగా ఈ మూవీ నుంచి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ (ఒరిజినల్ సౌండ్ ట్రాక్)ను విడుదల చేశారు మేకర్స్. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ సాంగ్‌లో రజినీకాంత్ మాస్ లుక్, ఆయన స్టైల్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# బ్లాక్ బస్టర్ తరువాత కనిపించని బ్లాక్ బ్యూటీ

**ఐశ్వర్య రాజేశ్ కి నటిగా మంచి క్రేజ్**

**ఓటీటీలలో ఆమె సినిమాలకి మంచి డిమాండ్**

**'సంక్రాంతికి వస్తున్నాం'తో దక్కిన తిరుగులేని హిట్**

**ప్రస్తుతం తమిళ ప్రాజెక్టులతో బిజీ**

**త్వరలో కన్నడ తెరపై సందడి**

**టాకీస్:** హీరోయిన్ అంటే గ్లామరస్ గానే ఉండాలి.. పాటలకి ముందే రావాలి.. పాటల్లో మాత్రమే కనిపించాలి అనే రోజులు పోయాయి. ఇప్పుడు చాలామంది హీరోయిన్స్ నటన ప్రధానమైన పాత్రలను మాత్రమే ఒప్పుకుంటూ వెళుతున్నారు. అలాంటి హీరోయిన్స్ లో సాయిపల్లవి, నిత్యామీనన్.. ఆ తరువాత స్థానంలో ఐశ్వర్య రాజేశ్ కనిపిస్తుంది. కోలీవుడ్ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతూ, తెలుగు తెరపై చోటు సంపాదించుకున్న కథానాయిక ఆమె.

ఐశ్వర్య రాజేశ్ గతంలో కొన్ని తెలుగు సినిమాలు చేసింది. అయితే తెలుగులో ఆమె నేరుగా చేసిన సినిమాలకంటే కూడా, తమిళం నుంచి ఓటీటీకి వచ్చిన అనువాదాలు ఇక్కడి ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. ఆ జాబితాలో డ్రైవర్ జమున గ్రేట్ ఇండియన్ కిచెన్, సొపన సుందరి, ఫర్హానా వంటి సినిమాలు కనిపిస్తాయి. ఈ సినిమాలలోని ఆమె నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆమె అభిమానులుగా మారిపోయారు.

అలాంటి ఐశ్వర్య రాజేశ్ కి ఈ ఏడాది ఆరంభంలోనే 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ పడింది. ఈ సినిమాలో ఆమె పాత్రకి కూడా మంచి పేరు వచ్చింది. ఈ సినిమా తరువాత ఐశ్వర్య రాజేశ్ ఇక్కడ వరుస సినిమాలు చేసుకుంటూ వెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ అలాంటి వాతావరణమేమీ కనిపించడం లేదు. కన్నడ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుండటం, తమిళంలో బిజీగా ఉండటమే అందుకు కారణమా..? లేదంటే సరైన కథలు రాకపోవడమా..? అనేదే ఆమె అభిమానులకు అర్థం కావడం లేదు.




# సముద్ర తీరంలో శోభిత..

### చీరకట్టులో మెస్మరైజ్ చేస్తూ అందాల సోయగం..




టాకీస్: శోభితా ధూళిపాళ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అచ్చ తెలుగమ్మాయి.. కానీ హిందీ సినిమమా ప్రపంచంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు, హిందీ, తమిళం భాషలలో బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో నటించి మెప్పించింది. కొన్నాళ్ల క్రితం టాలీవుడ్ హీరో నాగచైతన్యను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ హీరోయిన్ అక్కినేని ఇంటి కోడలు శోభిత ధూళిపాళ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రామన్ రాఘవన్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఎక్కువగా హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. హిందీతోపాటు తెలుగులోనూ పలు సినిమాల్లో కనిపించింది. తెలుగులో మేజర్, గూఢచారి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. అలాగే పొన్నియన్ సెల్వన్ 1, 2 చిత్రాలతో తమిళంలోనూ మెప్పించింది. గతేడాది మంకీ మ్యాన్ సినిమాతో అలరించింది. విభిన్న కంటెంట్ చిత్రాలతో మంచి ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. గతేడాది అక్కినేని హీరో నాగచైతన్యను పెళ్లి చేసుకుంది. వీరిద్దరి వివాహం అన్నపూర్ణ స్టూడియోస్ లో జరిగింది. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉన్న శోభితా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్న శోభితా... నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటుంది. ఇటీవలే సెట్ లో వంటలు చేస్తున్న ఫోటోస్ షేర్ చేసి ఆశ్చర్యపరిచింది. ఇక చీరకట్టులో అందమైన ఫోటోస్ పంచుకుంది. సముద్ర తీరంలో నీలిరంగు చీరకట్టులో సింపుల్ గా కనిపిస్తుంది. 2013లో మిస్ ఇండియా అందాల పోటీల్లో రెండో స్థానం సొంతం చేసుకుంది శోభిత. ఆ తర్వాత మిస్ ఎర్త్ ఇండియా అందాల పోటీల్లో భారతదేశం తరపున పాల్గొంది.

# మారెమ్మ గ్లింప్స్ విడుదల

**టాకీస్:** సినిమా ఇండస్ట్రీకి మరో స్టార్ వారసుడు అరంగేట్రానికి సిద్ధమవుతున్నాడు. మాస్ మహారాజా రవితేజ సొదరుడి కుమారుడు మాధవ్ భూపతి రాజు, 'మారెమ్మ' అనే గ్రామీణ యాక్షన్ డ్రామాతో హీరోగా వెండితెరకు పరిచయం అవుతున్నాడు. మాచర్ల నాగరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. మాధవ్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఒక గ్లింప్స్ వీడియోని విడుదల చేసింది. ఇందులో మాధవ్ గుబురు గడ్డంతో, రగ్గడ్ లుక్‌లో, మాస్ స్టైల్‌తో కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా లుంగీ కట్టుకొని కబడ్డీ మైదానంలోకి నడుచుకుంటూ వచ్చే సన్నివేశం.. అతని పాత్ర శక్తివంతమైనదిగా ఉండబోతోందని చెబుతోంది.



'మారెమ్మ' సినిమా ఒక పల్లెటూరి నేపథ్యం కలిగిన యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా రూపొందుతోంది. వాస్తవికతకు దగ్గరగా ఉండేలా గ్రామీణ వాతావరణంలో చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ సినిమాలో మాధవ్ పూర్తి మాస్ అవతారంలో కనిపించనున్నాడు. తొలి సినిమాలోనే మాధవ్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, మాస్ డైలవరీలతో మంచి ఇంపాక్ట్ చూపించాడు. హీరోగా తన స్థానం సెట్ చేసుకునేందుకు మాధవ్ ఎంతగానో కష్టపడుతున్నట్లు ఈ వీడియో చూస్తే అర్థమవుతుంది. అతని యాక్షన్, పాత్ర ఇంటెన్సిటీ చూసినవారు, 'మారెమ్మ'పై భారీ అంచనాలు పెట్టుకుంటున్నారు.

ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్, ఆడియో వివరాలు వెల్లడించనున్నట్టు చిత్రయూనిట్ సమాచారం. ఇక ఈ సినిమా ద్వారా రవితేజ సోదరుని కుమారుడు టాలీవుడ్‌లో ఎలా నిలదొక్కుకుంటాడన్నది ప్రేక్షకుల ఆసక్తికరంగా గమనిస్తున్నారు.కాగా, హీరోగా, ఆర్టిస్టుగా నటించిన రఘు కుమారుడే మాధవ్ భూపతి రాజు. మూవీలో దీపా బాలు హీరోయిన్‌గా నటిస్తుండగా వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, దయానంద్ రెడ్డి, రూపా లక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ విహారి మ్యూజిక్ అందిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ ఓజీకి హైప్

### ప్రమోషన్స్‌లో బిజీగా ప్రియాంక అరుళ్

టాకీస్: టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. 'ఓజి'. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్కీన్ర్ కెమిస్ట్రీక్రి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు- మిగతా ప్రధాన నటీ-నటు-లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు- సమాచారం. ఇక ఈ సినిమా పాన్-ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడింది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ప్లాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో ఓజి టీ-మ్ నుంచి ఇంకా పెద్ద ప్రమోషనల్ ఈవెంట్స్, స్పెషల్ ఇంటర్వ్యూలు, మ్యూజిక్ ఈవెంట్, ప్రీ-రిలీజ్ ఫంక్షన్ లాంటివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.